క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులపై ఏఈఓలకు అవగాహన



ఏఈఓలతో శాస్త్రవేత్తలు, అధికారులు

సిద్దిపేటరూరల్: వానాకాలం ముందస్తు పంటల సాగుపై వ్యవసాయ అధికారులు, ఏఈఓలకు తోర్నాల పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త సంతోష్‌కుమార్ వానాకాలం సాగుచేసే పంటలను గురించి అధికారులకు వివరించారు. పంటల రక్షణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను తెలిపారు. ఈ విషయాలను రైతులకు తెలియజేస్తూ సాగులో వారిని చైతన్యవంతం చేయాలని సూచించారు. అనంతరం డీఏఓ స్వరూపారాణి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మ, ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డా.సీహెచ్ పల్లవి, డా.ఎ.రమాదేవి, శ్వేత, సరిత, 40 మంది ఏఈఓలు పాల్గొన్నారు.

పొగాకు ప్రాణాంతకం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

హుస్నాబాద్: ప్రపంచ టొబాకో వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం మోడల్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వంత్ మాట్లాడుతూ పొగతాగడం ఆరోగ్యానికి హానికరమన్నారు. సిగరెట్ తాగినా, పొగాకును వినియోగించినా శ్వాసకోశ వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. సిగరెట్లు, గుట్కాలు వంటి చెడు అలవాట్లతో అనారోగ్యాలకు గురికావద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వానలతో అప్రమత్తం



ఎస్‌ఐ ప్రశాంత్

అక్కన్నపేట(హుస్నాబాద్): వారం రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తామని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయని అటువైపు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షం కురిసేటప్పుడు విద్యుత్ సబ్ స్టేషన్లు, సెల్ టవర్లు, చెట్ల కింద నిలబడవద్దని చెప్పారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సౌజన్య

బెజ్జంకి(సిద్దిపేట): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు చాలా కీలకమని ఎస్‌ఐ సౌజన్య అన్నారు. బెజ్జంకిలోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం సాయిబాబా, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు సీసీ కెమెరాలను వితరణ చేసిన రాచకొండ తిరుపతిగౌడ్, శివశైలును అభినందించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సయ్య, లక్ష్మీనారాయణ, నర్సింహాచారి, పెద్దన్న, మల్లేశం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పరిశీలన



గ్రామస్తుడితో మాట్లాడుతున్న కేంద్ర బృందం

బెజ్జంకి(సిద్దిపేట): స్వచ్ఛ సర్వేక్షణ కేంద్ర బృందం సభ్యులు శ్రీలత, హరిదీప్తి ప్రియ, సత్యానారాయణ, చెన్నారెడ్డి బెజ్జంకితోపాటు గుండారం, బేగంపేట గ్రామాలలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను గురువారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు, గృహాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. గ్రామాలలో చేపడుతున్న మౌలిక సదుపాయాల అమలు తీరును తెలుసుకున్నారు. పూర్తిచేసిన పనులపై సమీక్షించారు. పంచాయతీ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పరిశుభ్రత కోసం చేపట్టబోయే కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ ప్రవీణ్, కార్యదర్శులు ప్రణీత్‌రెడ్డి, రమేశ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రహదారి రక్త సిక్తం



చిట్టాపూర్- భూంపల్లి మార్గ మధ్యలో ఢీకొట్టుకున్న కారు, ఆటో

- మూడేళ్లుగా కొనసాగుతున్న పనులు
- నిత్యం సంభవిస్తున్న ప్రమాదాలు
- కానరాని ప్రమాద సూచికలు
- మృత్యువాత పడుతున్న ప్రజలు

రోజు రోజుకు ఆ రహదారిపై ప్రమాదాలు అధికమవుతూనే ఉన్నాయి. వాహనాలల్లో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే.. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇంటి నుంచి వెళ్తే తిరిగి వస్తామో? లేదో? అనే భావన కలుగుతోంది.

దుబ్బాకరూరల్: మెదక్ జిల్లా నుంచి వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వరకు జాతీయ రహదారి(డీజీ) పనులు కొనసాగుతున్నాయి. ఈ రహదారిలో రామాయంపేట నుంచి దుబ్బాక మండలం మీదుగా పోతారెడ్డిపేట, అక్బర్‌పేట భూంపల్లి, చిట్టాపూర్, హబ్సిపూర్, ధర్మారం, తిమ్మాపూర్ నుంచి సిద్దిపేట వరకు పనులు జరుగుతున్నాయి. మొదలు పెట్టి మూడున్నరేళ్లు గడుస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు.

రక్తమోడుతున్న రోడ్డు

సంవత్సరాల తరబడి సాగుతున్న ఈ రోడ్డు పనులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. నిత్యం ఏదోకచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు చాలా మంది మరణించిన ఘటనలు ఉన్నాయి.

సూచిక బోర్డులు లేవు..

పనులు కొనసాగుతున్న చోట కనీసం సూచిక బోర్డులు లేవు. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా కాంట్రాక్టర్లు మాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా కాంట్రాక్టర్లకే వత్తాసు పలుకుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పనుల్లో నాణ్యత కరువు



రోడ్డు ప్రక్కన డ్రైనేజీలో కూరుకుపోయిన లారీ

కాంట్రక్టర్లు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు పక్కన డ్రైనేజీలు తీసి వాటిపై సిమెంట్ స్లాబ్‌లు నిర్మించకుండా అలాగే వదిలేశారు. డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేయక పోవడంతో వాహనాలు అందులో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ రహదారి నిత్యం రక్త సిక్తంగా మారుతోందని. వేగవంతంగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని, ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

స్లాబ్‌లు నిర్మించడానికి అనుమతి రాలేదు

రోడ్డు ప్రక్కన డ్రైనేజీలు నిర్మించాం. వాటిపై స్లాబ్‌లు ఇంకా నిర్మించలేదు. వాటి నిర్మాణం కోసం పై అధికారులకు విన్నవించాం అక్కడక్కడ పనులు జరుతున్నాయి. అనుమతులు రాగానే పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపడతాం.

- అన్నయ్య, ఆర్‌అండ్‌బీ డీఈఈ

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం గజ్వేల్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో కేక్ కట్‌చేసి కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కేకు పంపిణీ చేసి సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



పాత ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. స్థానిక 23వ వార్డులో డ్రైనేజీపై స్లాబ్ వేసిన ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఆ స్లాబ్‌ను తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద కాంప్లెక్స్ దుకాణదారులు రోడ్డుపై చెత్త వేయడాన్ని గమనించి వారికి జరిమానా విధించాలని సూచించారు. అనంతరం 28వ వార్డులో పర్యటించారు. వార్డులో పాత ఇళ్లను పరిశీలించి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని వారికి పరిస్థితిని వివరించారు. అలాగే ఆరో వార్డులో కుక్కల బెడద ఉందని చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి స్రవంతి ఆశ్రిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు లక్ష్మణ్, మల్లికార్జున్ అధికారులు పాల్గొన్నారు.

369 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు: ఎంపీడీఓ



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కరశర్మ

దుబ్బాకరూరల్: ఇందిరమ్మ ఇళ్లు, వనమహోత్సవంపై మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కరశర్మ మండల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండంలో 369 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కొందరు ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి పనులు ప్రారంభించారని, మిగిలిన వారు కూడా పనులు ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే వన మహోత్సవంలో మొక్కలు నాటాలని, ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు. మొక్కలు నాటక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


గోరింటా.. పండింది



గోరింటాకు ఉత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

గజ్వేల్‌రూరల్: ఆషాఢమాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ మాసంలో బోనాల ఉత్సవాలతోపాటు గోరింటాకు సంబురాలు మహిళలకు ఎంతో ఇష్టమైనవని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోరింటాకు పెట్టుకోవడంలో శాస్త్రీయతతోపాటు భారతీయ సమాజంలో ఎంతో ప్రాధాన్యం ఉందని, వర్షాకాలంలో వచ్చే వ్యాధులను గోరింటాకు అడ్డుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కవిత, కెప్టెన్ డాక్టర్ భవాని, డాక్టర్ అలివేలు, లావణ్య, మంజుల, మమత, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే రుణాలు



పిండి వంటలను పరిశీలిస్తున్న కమిషనర్ బాలకృష్ణ

గజ్వేల్‌రూరల్: మహిళల ఆర్థికాభ్యున్నతికే ప్రభుత్వం రుణాలు అందిస్తుందని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మెప్మా ఆధ్వర్యంలో గురువారం స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్, ఎస్‌హెచ్‌జీ ప్రొడక్ట్స్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన వివిధ రకాల వంటకాలు, జూట్ బ్యాగులు, మగ్గం, ఎంబ్రాయిడరీకి సంబంధించిన వాటిని పరిశీలించి అభినందించారు. మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

యూరియాను నిల్వచేస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి స్వరూపరాణి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యూరియాను అనధికారికంగా నిల్వ చేస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి స్వరూప హెచ్చరించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకే రైతులు యూరియా వినియోగించాలని, అధిక మొత్తంలో వినియోగించినా పంట దిగుబడి తగ్గుతుందని చెప్పారు. ఎరువులు వినియోగంలో శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లాలోని ఎరువుల డీలర్లు జాగ్రత్తలు పాటించాలని, లేని పక్షంలో షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎక్కడైనా యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వల వివరాలు తెలిస్తే స్టేట్ లెవల్ కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నంబర్ 89 777–41771కు సమాచారం అందించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

బీజేపీ రాష్ట్ర నేత రాంగోపాల్‌రెడ్డి

కోహెడ(హుస్నాబాద్): గ్రామాలలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. కోహెడలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం కావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం, మండల అధ్యక్షుడు జాలిగం రమేశ్, సురేందర్‌రెడ్డి, బాపురెడ్డి, సాగర్‌రావు, లక్ష్మణ్, సురేందర్, రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సంక్షేమ హాస్టళ్లు

- అద్దె భవనాల్లో విద్యార్థుల అవస్థలు
- టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు చరణ్‌తేజ



మాట్లాడుతున్న టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు చరణ్‌తేజ

దుబ్బాక: అద్దెభవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) జిల్లా అధ్యక్షుడు ఇస్తారిగల్ల చరణ్‌తేజ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని పలువురు నాయకులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని బీసీ కళాశాల హాస్టల్ పదహారేళ్లుగా అద్దె భవనంలోనే అరకొర వసతుల మధ్య కొనసాగుతుందన్నారు. రెండేళ్ల నుంచి బిల్లులు రాలేదు. వానలకు భవనంలో నీరు కారుతుండడంతో విద్యార్థులు నరకయాతన పడుతున్నారన్నారు. పడుకోవడానికి గదులు, దుస్తులు ఆర వేసుకునేందుకు తగిన స్థలాలు లేవు. కనీసం స్నానాల గదులుకూడా సరిగా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌కు కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు స్పందించి విద్యార్థుల కష్టాలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో సాయి, ప్రశాంత్, మధు, స్వామి, రమేశ్, హర్షిత్ ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా

ఏసీపీ నర్సింహులు



మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహులు

దుబ్బాకటౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని, సమస్యాత్మక గ్రామాలల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు ఆదేశించారు. రాయపోల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా గ్రామాలలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకమని, అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలు, నాయకులు, వ్యాపారవేత్తలకు అవగాహన కల్పించాలని సూచించారు. పనిచేయని కెమెరాలను వినియోగంలోకి తేవాలని, సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విధిగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తొగుట సీఐ షేక్ లతీఫ్, ఎస్‌ఐ కుంచెం మానస, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిని పరిశీలించిన డీఎంహెచ్‌ఓ



రికార్డులు పరిశీలిస్తున్న ధనరాజ్

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యం తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత గురించి వైద్యుడు శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానలు పడుతున్న తరుణంలో వైద్య సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలన్నారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఉప కేంద్రాల నిర్వహణలో లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

జేఏసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. జేఏసీ ఆధ్వర్యంలో గుర్జకుంట క్రాస్ రోడ్డు నుంచి ముస్త్యాల శివారు వరకు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, జేఏసీ ప్రతినిధులు అశోక్, బీరయ్య, సత్యానారాయణ, రఘుపతిరెడ్డి, వెంకటాద్రి, సుధాకర్, యాదగిరి, నరేశ్, భాస్కర్‌రెడ్డి, బాల్‌మోహన్, నరసింహాచారి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యం


వర్గల్(గజ్వేల్): విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని, వీలైనంత గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గురువారం తున్కిఖాల్సా జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. మహిళల రక్షణకు షీ టీమ్స్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని, ఏదైనా సమస్య ఉత్పన్నమైతే డయల్ 100, షీ టీమ్ 8712667434 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. హెచ్‌ఎం శ్రీలక్ష్మి, షీటీమ్ హెచ్‌సీ మహేందర్‌రెడ్డి, పీసీలు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సిద్దిపేటలో గురువారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం స్థానిక గుడ్ల చెరువు డబుల్‌బెడ్రూం ఇళ్లలో నివసిస్తున్న ఆగుళ్ల మహేశ్, సంధ్య దంపతుల రెండేళ్ల కొడుకు దిలీప్, ఆరు నెలల పాప శ్రీవల్లి ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం మహేశ్ బయటకు వెళ్లాడు. బాలుడు దిలీప్ ఆడుకుంటూ నానమ్మ వెంట భవనంపైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. స్థానికులు బాలుడిని ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బాలుడు గురువారం మృతి చెందాడు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


- ఉపాధ్యాయ సంఘాల జేఏసీ రాష్ట్ర నేత రాజయ్య
- తహసీల్దార్లకు వినతి పత్రాల సమర్పణ



గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) రాష్ట్ర కార్యదర్శి రాజయ్య డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా నాయకులు తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. అన్ని క్యాడర్‌ల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గజ్వేల్/కొమురవెల్లి(సిద్దిపేట)/చిన్నకోడూరు(సిద్దిపేట)/కోహెడ(హుస్నాబాద్/నంగునూరు(సిద్దిపేట)/మద్దూరు/మిరుదొడ్డి(దుబ్బాక)/(హుస్నాబాద్): గజ్వేల్ జోన్ పరిధిలోని గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, రాయపోల్, మర్కూక్, రాయపోల్ మండలాల్లో తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర కమిటీ కార్యదర్శి రాజయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్, టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ జె.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి, మహిళా కార్యదర్శి మంజుల తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ కొమురవెల్లిశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ దివ్యకు వినతి పత్రం అందించారు. వెంటనే పీఆర్సీ ప్రకటించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులు ప్రకటించాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయాలని, నాయకులు భిక్షపతి, రాంకిషన్, సత్యానారాయణ, యాదగిరి, ప్రవీణ్‌కుమార్, దశరథం, శ్రీనివాస్, రాజమౌళి, గిరిబాబు, శివుడు, కృష్ణంరాజు పాల్గొన్నారు. చిన్నకోడూరులో మహేందర్, కనకరాజు, దేవఋషి, ఎల్లం తహసీల్దార్ సలీమ్‌కు వినతి పత్రం అందజేశారు. కోహెడలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభాకర్, రాజేందర్, ప్రభాకర్‌రెడ్డి, రవి, స్వప్న, సురేశ్, చారి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. నంగునూరు ఎస్.కనకయ్య, హరికృష్ణ, రవి, సుశీల, రాజు, మనీశ్‌కుమార్, గోవర్ధన్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. దూళ్మిట్టలో కిష్టయ్య, కొలుపుల రాములు, గిరి సురేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, నాగులపల్లి రాములు, నిమ్మ సురేందర్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డిలో ర్యాకం మల్లేశం శివాజీ, యాదగిరి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నాగరాజు, బైరారెడ్డి, యాదయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి(సిద్దిపేట): తహసీల్దార్ దివ్యకు వినతి పత్రం అందిస్తున్న జేఏసీ నేతలు